

సైకిల్ దిగిపోయి..ఫ్యాన్ కిందకు

విజయనగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 125 యాదవ కుటుంబాల వారు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు.

- 8లో



సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

- 8లో

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు.



గురుతర బాధ్యతకు వారధి

ఉపాధ్యాయ పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడేలా తెలుగు సంస్కృత అకాడమీ ప్రశ్నల నిధిని సిద్ధం చేసింది.

- 8లో

న్యూస్‌రీల్

నేడు రైతుల ఖాతాల్లో పెట్టుబడి రాయితీ జమ

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో గతేడాది డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్మును ప్రభుత్వం బుధవారం విడుదల చేయనుందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మిచాంగ్ తుఫాన్ వల్ల జిల్లాలోని 1059 మంది రైతులకు చెందిన 297.77 హెక్టార్లలో 33 శాతం పైబడి వరి పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు ధ్రువీకరించారు. రూ.50.62 లక్షల పెట్టుబడి రాయితీని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి రైతుల ఖాతాల్లో జమచేస్తారన్నారు. వరి పంటకు హెక్టారుకు రూ.17వేలు చొప్పున పెట్టుబడి రాయితీ రైతుల ఖాతాలకు జమకానుందన్నారు.

పుణ్యగిరి జాతరపై సమీక్ష



ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయంలో శివరాత్రి ఉత్సవాలపై సమీక్షిస్తున్న అధికారులు

శృంగవరపుకోట: పుణ్యగిరిలో శివరాత్రి జాతర ఏర్పాట్లపై ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. ముందుగా పుణ్యగిరి ట్రస్టుబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ దేవదాయశాఖ చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. చలివేంద్రాలు, ప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, లైటింగ్ ఏర్పాట్లను ఈఓ తెలియజేశారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తామని ఎస్‌ఐ గంగరాజు చెప్పారు. బస్సు సరీ్వసులు, పారిశుద్ధ్య పనులు, భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై ఆయా శాఖాధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి 52 ప్రత్యేక బస్సులు

- డీపీటీఓ టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: మహాశివరాత్రి పర్వదినాన వివిధ పుణ్యక్షేత్రాల సందర్శనకు జిల్లా పరిధిలోని డిపోల నుంచి 52 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. స్థానిక డీపీటీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం డిపో నుంచి గుంప సోమేశ్వరుని దేవాలయానికి ఏడు బస్సు సర్వీసులు, సాలూరు డిపో నుంచి పాదమ్మ కొండ క్షేత్రానికి 25 బస్సులు, పాలకొండ డిపో నుంచి రాజాం, చీపురుపల్లికి ఆరు సర్వీసులు, రామతీర్థంలోని రామస్వామి క్షేత్రానికి 14 బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. సాధారణ పల్లెవెలుగు చార్జీలతోనే ప్రయాణ సేవలు అందిస్తామని తెలిపారు. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే గిరిజనాభివృద్ధి

- డిప్యూటీసీఎం రాజన్నదొర
- కురుపాంలో నూతన పోలీస్‌స్టేషన్ భవనం, ఏకలవ్య పాఠశాల భవనాల ప్రారంభం

కురుపాం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగాయని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. కురుపాం నియోజకవర్గ కేంద్రంలో ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నిధులు రూ.2కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ సముదాయాలను, రూ.12 కోట్ల ఖర్చుతో నిర్మించిన ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. కురుపాం నియోజకవర్గంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం కూడా దాదాపు పూర్తికావచ్చిందని తెలిపారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు పోలీస్ సూపరింటెండెంట్ ఒ.దిలీప్ కిరణ్, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, ఈఈ శాంతేశ్వరరావు, ఎస్‌ఐలు, సీఐలు పాల్గొన్నారు.

వెన్నుపోటు

- టీడీపీ బీసీ డిక్లరేషన్ కమిటీలో బీసీలకు మొండిచేయి
- విజయనగరం పార్లమెంటరీ నియోజక వర్గ నేతలకు దక్కని ప్రాతినిథ్యం
- అసెంబ్లీ టికెట్ల కేటాయింపులోనూ అన్యాయం
- బీసీల జిల్లాలో అగ్రవర్ణాల నాయకులదే ఆధిపత్యం
- బీసీలంటే చంద్రబాబుకు ఎన్నడూ చులకనభావమే..



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అవసరానికి వాడుకోవడం.. అవసరం తీరాక వదలించుకోవడం టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య. 'బీసీలు టీడీపీకి బ్యాక్ బోన్' అంటూ ఉత్తుత్తి మాటలతో దశాబ్దాలుగా అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. మాటలకు చేతలకు ఎంత తేడా ఉందో ఇప్పటికే బీసీలకు అవగతమైంది. 'బీసీ డిక్లరేషన్' పేరుతో వారిని మళ్లీ మోసం చేశారు. అదెంత లోపభూయిష్టమో టీడీపీ బీసీ డిక్లరేషన్ కమిటీని చూస్తేనే అర్థమవుతుంది. రాష్ట్రంలో అత్యధిక బీసీ సామాజికవర్గాలున్న పార్లమెంటరీ నియోజకవర్గాల్లో విజయనగరం ఒకటి. కానీ ఇక్కడి నుంచి ఏ ఒక్క నాయకుడికి ఆ కమిటీలో ప్రాతినిథ్యం లేదు. చివరకు అసెంబ్లీ టిక్కెట్ల విషయంలోనూ ఓసీలకే చంద్రబాబు పెద్దపీట వేశారు. బీసీ సామాజిక వర్గాలకు మొండిచేయి చూపించారు. దీనిపై ఇప్పటికే బీసీ సామాజికవర్గాలు రగిలిపోతున్నాయి. మరోసారి చంద్రబాబును మట్టికరిపించేందుకు సిద్ధమవుతున్నాయి.

బీసీలంటే అంత చిన్నచూపా..!

ఉమ్మడి విజయనగరం జిల్లాలో బీసీ సామాజిక వర్గాలదే అగ్రభాగం. ఓసీల సంఖ్య చాలా స్వల్పం. కానీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఇప్పటికీ అగ్రవర్గాల నాయకులకే ఆధిపత్యం అప్పగిస్తూ వస్తున్నారు. బీసీలను అణగదొక్కుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలు నాలుగూ రిజర్వ్డు నియోజకవర్గాలే అయినప్పటికీ అక్కడ బీసీ సామాజిక వర్గాలు నిర్ణాయక శక్తిగా ఉన్నాయి. అక్కడ తగిన గుర్తింపు ఇవ్వకపోయినా కనీసం విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోనైనా దక్కుతుందేమోనని ఆశించారు. ఎస్సీ రిజర్వ్‌డ్ రాజాం అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగతా ఆరు ఎచ్చెర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీ సామాజికవర్గాలే అధిక శాతం ఉన్నారు.

బీసీల వేదన అరణ్యరోదన...

టీడీపీకి సేవచేసే బీసీలు.. రాజ్యాధికారం విషయానికొచ్చేసరికి కరివేపాకు అయిపోతున్నారు. ఇటీవల అసెంబ్లీ టికెట్లను టీడీపీ, జనసేన సంయుక్తంగా కేటాయించిన విషయం తెలిసిందే. విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఎచ్చెర్ల, చీపురుపల్లి మినహా అన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను చంద్రబాబు ప్రకటించారు. ఎస్సీ రిజర్వ్డ్ రాజాం నియోజకవర్గానికి కోండ్రు మురళీమోహన్ వైపే చంద్రబాబు మొగ్గు చూపించారు. కానీ ఆ నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ఉన్న తూర్పుకాపు (బీసీ) సామాజికవర్గమంతా ముక్తకంఠంతో కోండ్రును వ్యతిరేకిస్తోంది. గతానుభవాల దృష్ట్యా ఆయన వద్దంటూ చంద్రబాబుకు మొత్తుకున్నా ఫలితం లేకపోయింది.

బీసీల కోటల్లో ఓసీలకు టికెట్లు...

కొప్పుల వెలమల (బీసీ) సామాజిక వర్గం అత్యధికంగా ఉన్న బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ టిక్కెట్‌ను పట్టుమని వెయ్యి మంది కూడా లేని ఓసీ సామాజికవర్గానికి చెందిన బేబీనాయనకు చంద్రబాబు టికెట్ ఇచ్చారు. దీంతో షాక్‌లో ఉన్న కొప్పుల వెలమలను బుజ్జగించేందుకు గజపతినగరం టికెట్ మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుకి పీలర్లు వదిలారు. శంఖారావం కార్యక్రమానికి ఇటీవల బాడంగి వచ్చిన నారా లోకేశ్ కూడా కొప్పుల వెలమ నాయకులను మభ్యపెట్టారు. తప్పనిసరిగా కొప్పుల వెలమలను చట్టసభకు పంపిస్తానంటూ ఇచ్చిన హామీ వట్టి బూటకమేనని తేలిపోయింది. బొబ్బిలి టికెట్ పోయింది. గజపతినగరం టికెట్ కూడా దక్కలేదు. అంతేకాదు కొప్పులవెలమ సామాజిక వర్గం అత్యధికంగా ఉండే విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గంలో ఒక్క టికెట్ కూడా వారికి చంద్రబాబు కేటాయించలేదు. ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సిన ఎచ్చెర్ల, చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో అడగడానికీ లేదు. ఈ దెబ్బతో కొప్పుల వెలమ నాయకులు రగిలిపోతున్నారు. టీడీపీ చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా ఫ్లెక్సీలు పెట్టారు. జిల్లాలో అత్యధిక ప్రాబల్యం ఉన్న తూర్పు కాపు సామాజిక వర్గానికి చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో తూర్పుకాపు నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే మీసాల గీతను పక్కనబెట్టారు. అశోక్ గజపతిరాజు తర్వాత అయినా తమకు న్యాయం జరుగుతుందని ఆశించినా ఫలితం లేకపోయింది. గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా మళ్లీ అశోక్ కుమార్తె అదితికే చంద్రబాబు టికెట్ ఇచ్చారు. అలాగే, నెల్లిమర్లలోనూ తూర్పుకాపు సామాజికవర్గానికి చెందిన కర్రోతు బంగార్రాజు, కంది చంద్రశేఖర్, కడగల ఆనంద్ తదితర సీనియర్ నాయకులెవరూ కనిపించలేదు. జనసేనతో పొత్తు ధర్మం పేరు చెప్పి ఓసీ సామాజిక వర్గానికి చెందిన లోకం మాధవికి టికెట్ ఇచ్చారు.

బీసీ డిక్లరేషన్ కమిటీ బూటకమే...

టీడీపీ ఏర్పాటుచేసిన స్టేట్ బీసీ డిక్లరేషన్ కమిటీలో కూడా ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ఏ ఒక్క నాయకుడికీ ప్రాతినిథ్యం దక్కలేదు. బీసీ సామాజిక వర్గాలు అత్యధికంగా ఉండే విజయనగరం జిల్లాకు టీడీపీ నాయకత్వం అన్యాయం చేయడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ అభ్యర్థులకు డిపాజిట్లు దక్కకుండా ఓడించేందుకు బీసీ వర్గాలు సన్నద్ధమవుతున్నాయి.



టీడీపీలో తమకు జరిగిన అన్యాయంపై బీసీలు పెట్టిన ఫ్లెక్సీ

7న కెమికల్ డిజాస్టర్‌పై మాక్ డ్రిల్

విజయనగరం అర్బన్: జిల్లాలోని మైలాన్ లాబొరేటరీస్ వద్ద ఈ నెల 7న నిర్వహించనున్న కెమికల్ డిజాస్టర్ మాక్ డ్రిల్ కోసం సర్వం సిద్ధం చేసినట్టు మాక్‌డ్రిల్ నోడల్ అధికారి, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ తెలిపారు. మాక్ డ్రిల్‌పై డైరెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ వర్మ, స్టేట్ డిజాస్టర్ మనేజ్మెంట్ అథారిటీ డైరెక్టర్ కూర్మనాథ్ వెబెక్స్ ద్వారా 17 జిల్లాల నోడల్ అధికారులతో మంగళవారం మాట్లాడారు. విధి విధానాలపై పలు సూచనలు చేశారు. జిల్లాల వారీగా మాక్ డ్రిల్‌పై చేసిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి ఆర్డీఓ సూర్యకళ మాట్లాడుతూ ఈ నెల 7న చోడమ్మ అగ్రహారం గ్రామం వద్ద ఉన్న మైలాన్ లాబొరేటరీస్‌లో అమ్మోనియా గ్యాస్ లీకేజీపై మాక్ డ్రిల్ చేస్తామన్నారు. దీనిపై స్థానికులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఎమెర్జెన్సీ రెస్పాన్స్ బృందాలను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. చోడమ్మ అగ్రహారం నుంచి 60 మందిని ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేశామని, బాధితులకు వైద్యసేవలకు దగ్గరలో ఉన్న ఆస్పత్రి వైద్యులను అప్రమత్తం చేసినట్టు వెల్లడించారు. వెబెక్స్‌లో డీఆర్వో ఎస్.డి.అనిత, పీసీబీఈఈ సరిత, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడిలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు మంగళవారం మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువ జామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, శంబర కృష్ణ తదితరులు అమ్మవారికి పూజాధికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

లక్ష్యం దిశగా సాగాలి



వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్యను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

విజయనగరం అర్బన్: విద్యార్థులు లక్ష్యం దిశగా సాగాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజు పాటు నిర్వహించిన జాతీయ స్థాయి 'మెకెనో ఎంఎండబ్లెక్స్‌ఐవీ' టెక్నికల్ సింపోజియం మంగళవారం ముగిసింది. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుకు మైటీ మెకానికల్‌గా పేరుందన్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. సింపోజియంలో ఆటో మొబైల్, సీఎఫ్‌డీసీ, సీఎస్‌సీ, హ్యూమనోయిడ్ 4.0 వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై సదస్సులో వక్తలు మాట్లాడారు. నాన్ టెక్నికల్, టెక్నికల్ అంశాలపై నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం వీసీని సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ సి.నీలిమాదేవి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు వి.మణికుమార్, డాక్టర్ కె.శ్రీనివాసప్రసాద్, స్టూడెంట్ కో–ఆర్డినేటర్లు కె.బాలాదిత్య, పి.జ్ఞానశరణ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను దశదిశలా వ్యాప్తి చేయాలి

- పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు వెలసిన విజయనగరంలో ఆధ్యాత్మికతను దశదిశలా వ్యాప్తి చేసేందుకు పటిష్ట ప్రణాళిక ఏర్పాటు చేసి రూపకల్పన చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ.ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి పక్కన ఉన్న ఖాళీస్థలంలో ఇకపై ప్రతి మంగళవారం పంచహారతుల కార్యక్రమం పూర్తయిన తర్వాత గంటన్నర పాటు ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి గీతాలాపన, కచేరీ నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పైడిమాంబ దీక్షాధారుల సేవా కమిటీతో పాటు పలువురు ఆధ్యాత్మికవేత్తలు ప్రతి మంగళవారం భక్తి సందేశాలను అందజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక శిరోమణి, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి ఆలపించిన భక్తిగీతాలు, ఆధ్యాత్మిక ప్రవచనం భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీ పైడిమాంబ దీక్షా పీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, మానాప్రగడ సాహితి తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసేవారిని మర్చిపోకూడదు

- ప్రభుత్వ బడుల బలోపేతానికి జగన్‌మోహన్‌రెడ్డి కృషి భేష్
- విద్యావ్యవస్థలో నూతన ఒరవడికి నాంది
- సినీ నటుడు సుమన్
- అట్టహాసంగా కత్తులకవిటి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

వీరఘట్టం: మనకు మేలుచేసేవారిని మర్చిపోకూడదని సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎందరో ముఖ్యమంత్రులను చూశానని.. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఇంతగా కృషిచేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ బడులను అందంగా, ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దారని, ఉజ్వల భవితకు గట్టిపునాది వేశారన్నారు. వీరఘట్టం మండలం కత్తులకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం అట్టహాసంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ ఎంతోమంది శాస్త్రవేత్తలు, మేధావులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నత పదవుల్లో ఉన్నవారు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించినవారేనని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న వారు తలెత్తుకు తిరిగేరోజులు మళ్లీ వచ్చాయన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పాఠశాల విద్య ఎంతో కీలకమని, ప్రతీ విద్యార్థి శ్రద్ధతో విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమాన్ని హాజరైన సినీ నటుడు శివారెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు ఆట, పాటలు ఎంతో ముఖ్యమన్నారు. పలువురు సినీ హీరోల గొంతులతో మిమిక్రీ చేసి విద్యార్థులను అలరించారు. నాడు–నేడు నిధులతో నిర్మించిన కంప్యూటర్ గదిని, దాతలు నిర్మించిన సైకిల్ షెడ్‌ను సుమన్ ప్రారంభించారు. అంతకు ముందు పాఠశాల హెచ్‌ఎం పి.సుధారాణి, ఎన్‌ఆర్‌ఐ గేదెల ధామోదరరావు, వైద్యుడు ద్వారపురెడ్డి రామ్మోహనరావు, జెట్పీటీసీ సభ్యులు జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దోల జగన్, సర్పంచ్ గేదెల సరోజనమ్మ తదితరులు సినీ నటులు సుమన్, శివారెడ్డిలను దుశ్శాలువలతో సత్కరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సినీ నటుడు సుమన్, శివారెడ్డితో సరదాగా ఫొటోలు దిగి సందడి చేశారు. వార్షికోత్సవంలో నృత్య ప్రదర్శనలతో చిన్నారులు అలరించారు.



కత్తులకవిటి పాఠశాల వార్షికోత్సవ వేడుకలో మాట్లాడుతున్న సినీ నటుడు సుమన్, పక్కనే సినీ నటుడు శివారెడ్డి, ఎన్‌ఆర్‌ఐ గేదెల ధామోదరరావు, డాక్టర్ రామ్మోహనరావు ,తదితరులు

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం





- 24 గంటలూ అందుబాటులో ఉంటున్న వైద్య సిబ్బంది

ఈ చిత్రంలో వైద్యసేవలు పొందుతున్న యువతి పేరు సీహెచ్ ప్రసన్న. ఆమెది పూసపాటి రేగ మండం గున్నపురెడ్డి పాలేం గ్రామం. కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురికావడంతో గతనెల 23వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో పూసపాటిరేగ పీహెచ్‌సీకి ఆమెను కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అక్కడ డ్యూటీలో ఉన్న డాక్టర్, సిబ్బంది ఆమెకు అవసరమైన చికిత్స అందించారు. కోలుకున్నాక ఇంటికి పంపించారు.

విజయనగరం ఫోర్ట్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లోనూ 24 గంటలూ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో పీహెచ్‌సీలు అనగానే సాయంత్రం 4 గంటలకే వైద్య సిబ్బంది వెళ్లిపోతారనే భావన ఉండేది. నేడు ఏ పీహెచ్‌సీకి వెళ్లినా వైద్యం అందుతుందన్న భరోసా కలుగుతోంది. ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు, పూర్తిస్థాయి సిబ్బందిని ప్రభుత్వం నియమించడంతో రాత్రి వేళల్లోనూ వైద్యసేవలు అందుతున్నాయి. ఆపదవేళ ప్రాణాలు నిలుస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. గతంలో పీహెచ్‌సీకి ఒక వైద్యాధికారి, స్టాఫ్ నర్సు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులను ప్రభుత్వం నియమించింది. ఎఫ్ఎన్ఓ లేదా ఎంఎన్ఓ ఉన్నారు. వైద్య పరీక్షలు చేయడానికి ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్, మందులు ఇచ్చేందుకు ఫార్మసిస్టును నియమించింది. దీంతో వైద్యసేవలు నిరంతరాయంగా అందుతున్నాయి. ఒక వైద్యాధికారి ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాలకు వెళ్లినా, మరొకరు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటున్నారు. అత్యవసర వేళ ఆస్పత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్యసేవలు అందజేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

రాత్రి సమయాల్లో పీహెచ్‌సీలను జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షిస్తున్నారు. సేవల తీరును పరిశీలిస్తున్నారు. డీఎంహెచ్‌ఓ కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. దీంతో వైద్య సిబ్బంది అందరూ పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంటున్నారు.



ఈ చిత్రంలో గర్భిణికి వైద్యసేవలందిస్తున్నది రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యులు. రామభద్రపురం మండలం కూరాకుల వీధికి చెందిన గర్భిణి గేదల రేవతికి గతనెల 25న పురిటినొప్పులు రావడంతో పీహెచ్‌సీలో చేర్చారు. వెంటనే వైద్యులు మెరుగైన వైద్యసేవలందించి సుఖప్రసవం జరిపారు.

ఏ సమయంలో వచ్చినా వైద్యం



జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీలు 24 గంటలూ పనిచేస్తాయి. రోగులు ఏ సమయంలో వచ్చినా చికిత్స అందుతుంది. వైద్య సిబ్బంది పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటారు. రాత్రి పూట ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

సైకిల్ దిగిపోయి..ఫ్యాన్ కిందకు

- వైఎస్సార్‌సీపీలో 125 టీడీపీ కుటుంబాల చేరిక
- యాదవ సంఘం నాయకుడు మన్యాల కృష్ణ నేతృత్వంలో పార్టీ తీర్థం
- కండువాలు వేసి ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్, జెడ్పీ చైర్మన్, ఎంపీ


వైఎస్సార్‌సీపీలో చేరిన మన్యాల కృష్ణకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం: ప్రతిపక్ష టీడీపీకి జిల్లాలో కోలుకోలేని దెబ్బ తగిలింది. గడిచిన రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్నా కనీస గుర్తింపు లభించకపోవడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధికి ఆకర్షితులై నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 125 యాదవ కుటుంబాల వారు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ, పట్టణ యాదవ సంఘం పల్ల అప్పలస్వామి నేతృత్వంలో మంగళవారం నగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌ల సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందకీ ముగ్గురు ప్రజాప్రతినిధులు కండువాలు కప్పి ఆహ్వానించారు. భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరగడంతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యంత కీలకమైన యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు అధిక సంఖ్యలో పార్టీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పాలకులు వెనుకబడిన సామాజిక వర్గాల ప్రజలను ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేస్తే..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సామాజిక సాధికారతే ధ్యేయంగా పాలన సాగిస్తోందని చెప్పారు. అన్ని సామాజిక వర్గాలకు తగిన గుర్తింపు నిస్తూ రాజకీయంగా, సామాజికంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో నూతనంగా చేరికలు జరగడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు మెచ్చిన పాలనను అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావడంలో యాదవ సంఘాల నాయకులు పని చేయాలని కోరారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ మాట్లాడుతూ దశాబ్దాలుగా టీడీపీలో ఉండి సేవలందించినా కేవలం తమను ఓటు బ్యాంక్‌లా వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీలోకి సామాజిక వర్గంలోని ఇతర పెద్దలతో కలిసి చర్చించి చేరినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం తామంతా శ్రమించి పని చేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి గదుల సత్యలత, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు, 7వ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ సూర్యనారాయణరాజు, బమ్మిడి అప్పలస్వామి అధిక సంఖ్యలో యాదవ సంఘాల నాయకులు, యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు పాల్గొన్నారు.


పార్టీలో చేరేందుకు వచ్చిన యాదవ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా రజక సంఘం చైర్మన్‌గా సన్యాసిరావు


మాట్లాడుతున్న అప్పికొండ సన్యాసిరావు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రజక సంఘం ఉమ్మడి విజయనగరం జిల్లా కమిటీ చైర్మన్‌గా అప్పికొండ సన్యాసిరావు ఎంపికయ్యారు. ఈ మేరకు స్థానిక జిల్లా సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా సన్యాసిరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ రజక జాతి అభివృద్ధి కోసం అందరి సహకారంతో కృషిచేస్తానన్నారు. సంఘం అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సెక్రటరీ జంప చిన్న, జిల్లా జాయింట్ సెక్రటరీ చిట్టిబాబు, సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు శీల తాతారావు, శ్రీను, చెల్లారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న తలపాగాతో శ్రీశైలం బయల్దేరిన భక్తులు


మల్లన్న తలపాగాతో భక్తులు

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని మల్లికార్జునకాలనీకి చెందిన శ్రీశైలం మల్లికార్జున స్వామి భక్తులు శివరాత్రి సందర్భంగా సమర్పించాల్సిన తలపాగాతో శ్రీశైలం బయలుదేరారు. ఈ మేరకు మంగళవారం ఆటోలో చీపురుపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడి నుంచి ట్రైన్‌లో శ్రీశైలం వెళ్లనున్నట్లు తలపాగా తయారీదారులైన చల్లా జయరాం, రమ, షన్ముఖరావు, పావని తెలిపారు. శ్రీశైలంలో రెండురోజుల పాటు శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొంటామన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష

విజయనగరం క్రైమ్/తెర్లాం: బాలికను అపహరించిన కేసులో ముద్దాయికి పోక్సో చట్టం ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, రూ.1000 అపరాధ రుసుం విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెలువరించారు. ఈ మేరకు తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ ఫస్ట్‌ఇయర్ చదువుతున్న బాలికను అదే గ్రామానికి చెందిన గొట్టివాడ ఈశ్వరరావు వెంటపడి ఇబ్బంది పెడుతూ, కిడ్నాప్ చేసి తీసుకువెళ్లినట్లు బాలిక తండ్రి తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో 2021 మార్చి 13న ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు అప్పటి ఎస్సై సీహెచ్.నవీన్ పడాల్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో ప్రాసిక్యూషన్ ప్రారంభం నుంచి తెర్లాం ఎస్సై రమేష్ కుమార్ సకాలంలో సాక్షులు, ఆధారాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో స్పెషల్ జడ్జిఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి పై విధంగా తీర్పు వెల్లడించారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించారు.

1200 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం లక్ష్యం


వేరుశనగ పంటను, పరికరాలను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

తెర్లాం: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) ఆధ్వర్యంలో 1200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ చెప్పారు. ఈ మేరకు తెర్లాం మండలంలోని నందబలగ గ్రామంలో ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై అందజేసిన పరికరాలతోపాటు, రైతులు బిందు, తుంపర్ల సేద్యం ద్వారా సాగుచేస్తున్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు మంగళవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది రూ.6.87కోట్లతో బిందు, తుంపర్ల సేద్యం కింద సబ్సిడీపై పరికరాలు, ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నామని తెలిపారు. జిల్లాలో లక్ష్యంగా పెట్టుకున్న 1200 హెక్టార్లలో ఇంతవరకు 500హెక్టార్లలో వివిధ రకాల ఉద్యానవన పంటలు సాగుచేయడంతోపాటు, వాటికి అవసరమైన పరికరాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. బిందు, తుంపర్ల పద్ధతిలో రైతులు ఉద్యానవన పంటలు సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేయడంతోపాటు, పంటలు మంచి దిగుబడి వస్తాయని తెలియజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్, కుసుమూరు సచివాలయం వీఏఏ వెంకటేశ్, ఏపీఎంఐపీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹ 244

నిరంతర శ్రమతోనే విజయం

- ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్


యండమూరి వీరేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు

విజయనగరం: నిరంతరం శ్రమించడం ద్వారానే జీవితంలో ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్న తపన సాధ్యపడుతుందని ప్రముఖ రచయిత, మనస్తత్వవేత్త యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో నగర పాలక సంస్థ విద్యాకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి రూపొందించి నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యండమూరి పదోతరగతి పరీక్షలకు విద్యార్థులు ఏ విధంగా సన్నద్ధం అవాలో వివరించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి, పోటీ పరీక్షలను తట్టుకుని విజేతలుగా నిలవడానికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను పదోతరగతి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న సమయంలో ఇటువంటి కార్యక్రమాలు రూపొందించిన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని అభినందించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, విద్యా కమిటీ సభ్యులు బాలి పద్మావతి, తాళ్లపూడి సంతోషి కుమారి, తొగరోతు సంధ్యారాణి, ఎంతఓలు రాజు, సత్యవతి, వివిధ డివిజన్ కార్పొరేటర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో బ్లడ్‌బ్యాంక్ ప్రారంభం


బ్లడ్‌బ్యాంకు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని, , పట్టణ, గ్రామీణ ప్రాంత పేద ప్రజల కోసం ఉన్నతమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్‌ఆర్ నిధులు రూ.90లక్షలతో నిర్మించిన బ్లడ్‌బ్యాంక్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారని, గత 30ఏళ్ల కాలంలో ఏ ముఖ్యమంత్రీ ఇలాంటి కార్యక్రమాలను చేపట్టలేదన్నారు. చీపురుపల్లిలో నిర్మించిన బ్లడ్‌బ్యాంకులో 500 యూనిట్ల బ్లడ్‌ను నిల్వచేసుకునే కెపాసిటీ ఉండడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో మంచి సేవా కార్యక్రమాల కోసం ముందుకు వస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్‌కు మంత్రి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.నిత్యానందరెడ్డి, డైరెక్టర్.పి.శరత్‌చంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు కేఆర్‌డీ.ప్రసాద్, ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనువాసులు నాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఎంపీటీసీ గెరిడి రామదాసు, వార్డు మెంబర్ మీసాల రామునాయుడు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో హెచ్‌సీ ప్రతిభ


హెచ్‌సీ కృష్ణంనాయుడిని అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వి.కృష్ణంనాయుడు విశేష ప్రతిభ కనబరిచి మూడు బంగారు, ఒక రజత, ఒక కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపికను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక హెచ్‌సీ క్రీడా ప్రతిభను ప్రశంసిస్తూ మహారాష్ట్రలోని పూణెలో ఫిబ్రవరి 13 నుంచి 17 వరకూ జరిగిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో కృష్ణంనాయుడు విశేష ప్రతిభ కనబర్చారని ఎస్పీ చెప్పారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ఆయన క్రీడాస్ఫూర్తి యువతకు ఆదర్శనీయమన్నారు. ఈ మేరకు రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ కేకేవీ.విజయనాథ్, రూరల్ ఎస్సై ఆర్.వాసుదేవ్ తదితరులు అభినందించారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం

కొత్తవలస: మండలంలోని కొత్తవలస–విజయనగరం రైల్వేలైన్‌లో తుమ్మికాపల్లి సమీపంలో గల ఫైర్‌స్టేషన్ వెనుకభాగంలో గల రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గమనించారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న ట్రాక్‌మన్ రైల్వేస్టేషన్ మాస్టర్‌కు తెలపగా..ఆయన సమాచారం మేరకు ఎస్సై రవివర్మ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు ఐదు రోజుల క్రితం గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఉండవచ్చని అనుమానించారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని ఎస్సై రవివర్మ తెలిపారు. మృతదేహాన్ని పూర్తిగా పురుగులు తినేయడంతో గుర్తు పట్టేందుకు అవకాశం కూడా లేకపోయింది. ఈ మేరకు వైద్యులతో ఘటనాస్థలంలోనే పోస్ట్‌మార్టం నిర్వహించి సమీపంలో గల చెరువు వద్ద ఖననం చేసినట్లు చెబుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ చెప్పారు.

జొన్నల మెషీన్ కింద పడి మహిళ మృతి


మృతి చెందిన మహిళ

బలిజిపేట: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన చిన్నమ్మి(43) పంటపొలంలో జొన్న కండెలు ఆడుతున్న మెషీన్ కింద ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటనపై మృతురాలి భర్త అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వి.శ్రీనివాసరావు కేసు నమోదుచేశారు. ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. తన అన్నయ్య రామారావు పొలంలో జొన్న కండెలను మెషీన్‌లో ఆడుతున్న పనికి చిన్నమ్మి వెళ్లింది. కొన్ని కండెలు మెషీన్ వెనుకభాగంలో పడిపోవడంతో తీసేందుకు వెళ్లిన ఆమెను ప్రమాదవశాత్తు మెషీన్ చక్రాలు లాగివేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

రైలు ఢీకొని తెర్లాం వాసి..

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో మంగళవారం రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొనడంతో విజయనగరం జిల్లా తెర్లాం గ్రామానికి చెందిన తురుబాటి శ్యామలరావు (55) మృతి చెందాడు. జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధర్ కేసు నమోదుచేశారు.

18 లీటర్ల సారా సీజ్

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లిలో సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 18 లీటర్ల సారా సీజ్ చేసినట్లు ఎస్సై భాస్కరరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో సారా అమ్ముతున్న విషయంపై అందిన సమాచారంమేరకు దాడిచేసి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు. గ్రామాల్లో సారా అమ్మకాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి


మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పక్కన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- మంత్రి బొత్స సత్యనారాయణ

రామభద్రపురం: నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశ్వీరదించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలోని కొట్టక్కి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి భర్త స్వర్గీయ అప్పికొండ శ్రీరాములునాయుడు పేరిట నిర్మించిన కల్యాణ మంటపాన్ని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారంతా శ్రీరాములునాయుడు ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారన్నారు. అందుకే రాష్ట్రంలో రాజకీయాలకతీతంగా అన్ని రంగాలకు చెందిన ప్రతి కుటుంబానికి మేలు చేశారని చెప్పారు. భవిష్యత్‌లో మరింత సంక్షేమం, అభివృద్ధిని సాధించు కునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశ్వీరదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, పార్టీ మండల మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల, ఎంపీటీసీ సామిరెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో అందరికీ సముచిత గౌరవం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, హైమావతి, నాయుడుబాబు తదితరులు

శృంగవరపుకోట: వైఎస్సార్సీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం దక్కుతుందని, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఎస్‌కోటలోని తన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు పాదయాత్రలో తన వెంట వచ్చిన ప్రతి ఒక్కరినీ దృష్టిలో ఉంచుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పించారన్నారు. కొంత మంది అపోహలతో పార్టీని వీడారని, వ్యక్తులతో కాకుండా, పార్టీలతో రాజకీయాలు చేయాలని హితవు పలికారు. పార్టీలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, మంత్రి బొత్స, జెడ్పీ చైర్మన్ చిన్నశ్రీను వంటి బలమైన నాయకత్వం పార్టీకి ఉందని, తాను నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని, నియోజకవర్గంలో పార్టీని డిస్టర్బ్ చేయాలని కొందరు పార్టీని వీడారని, వ్యక్తిగత స్వార్థం కోసం టీడీపీలోకి వెళ్లి ఎమ్మెల్యేపై బురద జల్లడం వారికి సరికాదన్నారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి పరిణామాలున్నా వైఎస్సార్‌సీపీ గెలవడం ఖాయమని, జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత గౌరవం దక్కిందన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు భార్య, అనుయాయులు పదవులు అనుభవిస్తూ, పార్టీని వీడడం సరికాదన్నారు. సమావేశంలో వేపాడ జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైఎస్సార్‌సీపీ వేపాడ, ఎల్.కోట, జామి, ఎస్.కోట మండలాల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, గుమ్మడి సత్యనారాయణ, గొర్లె రవికుమార్, మోపాడ కుమార్, గొరపల్లి శివ, పినిశెట్టి వెంకటరమణ, బుగత వెంకటేశ్వరరావు, ఐదు మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుతర బాధ్యతకు వారధి

- తెలుగు అకాడమీ' ప్రశ్నల నిధి
- డీఎస్సీ పోస్టుల వారీగా ప్రిపరేషన్ పుస్తకాల విడుదల



డీఎస్సీ పోటీ పరీక్షలకు తెలుగు అకాడమీ రూపొందించిన పుస్తకాలు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల నియామక (డీఎస్సీ) ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. సమయం తక్కువ ఉందని నిరుత్సాహపడే వారికి నిరుద్యోగులకు ధైర్యాన్నిచ్చే దిశగా తెలుగు సంస్కృత అకాడమీ బృహత్తర కార్యక్రమం చేపట్టింది. అభ్యర్థుల విజయానికి తోడ్పడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించగల క్వశ్చన్ బ్యాంక్‌కు రూపకల్పన చేసింది. ఇందు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిష్ణాతులైన ఉపాధ్యాయ ఉద్యోగులు, డైట్ కళాశాల అధ్యాపక, ప్రిన్సిపాల్స్‌ను ఎంపిక చేసి వారితో టీచర్ పోస్టుల వారీగా డీఎస్సీ పోటీ పరీక్షలకు ఉపయోగపడే ప్రశ్నల సమాహారం (క్వశ్చన్ బ్యాంక్) పుస్తకాలను తయారు చేసింది. ఆ పుస్తకాలను ఇటీవల తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.లక్ష్మీపార్వతి, డైరెక్టర్ వి.రామకృష్ణ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పుస్తక విక్రయ దుకాణాల్లో అందుబాటులో ఉంచారు.

పుస్తకాల రూపకల్పనలో జిల్లావాసులు

తెలుగు సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పుస్తక రచన, పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన పలువురిలో విజయనగరం జిల్లా వాసులు ఉన్నారు. జిల్లాలోని డైట్ కళాశాల గణిత విభాగాధిపతి డాక్టర్ నల్ల తిరుపతినాయుడు గణితం సబ్జెక్టుకు, డైట్ కళాశాల సీనియర్ ఇంగ్లిష్ ఫ్యాకల్టీ జీజీఎస్ నాగేశ్వరరావు సబ్జెక్టుకు ఎడిటర్స్‌గా వ్యవహరించారు. డైట్ కళాశాల గణిత అధ్యాపకుడు వీవీజే సుబ్రహ్మణ్యం, అలుగోలు జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు జీఎస్‌కాంతారావు గణిత శాస్త్ర బిట్స్ పుస్తకాలకు, గుర్ల మండలం వల్లాపురం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎ.ప్రవీణ్‌కుమార్, విజయనగరం మండలం చెల్లూరు ఎంపీయూపీ స్కూల్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ టీచర్ బి.మోహనరావు సాంఘిక శాస్త్రం బిట్స్‌కు రచయితలుగా పనిచేశారు.

మెథడాలజీపై ఎక్కువగా బిట్స్



ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ పోస్టు కోసం పరీక్ష రాసేవాళ్లకు ఈ పుస్తకాల్లో కచ్చితమైన ప్రిపరేషన్ విధానాన్ని వివరించాం. గ్రామర్ నుంచి యథావిధంగా గత డీఎస్సీ పరీక్ష పత్రాల్లాగానే వస్తాయి. వాటితో పాటు మెథడాలజీలో వచ్చే కఠినమైన ప్రశ్నలు కూడా ఈ పుస్తకాల్లో జోడించాం. సంక్షిప్తంగా ఇచ్చినప్పటికీ మంచి మార్కులు తెచ్చుకోవడానికి ఉపయోగపడతాయి.

జీజీఎస్‌నాగేశ్వరరావు,
జిల్లా డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు

కొత్త సిలబస్ నుంచి పాత మోడల్ పరీక్షల ప్రశ్నలు



నూతన సిలబస్‌లోని ప్రతి అంశం నుంచి కీలక భావాలను ఈ పుస్తకాల్లో క్రోడీకరించాం. పాత డీఎస్సీ మోడల్ ప్రశ్నపత్రాలను పరిగణనలోకి తీసుకుని కొత్త సిలబస్ నుంచి సేకరించిన కఠిన ప్రశ్నలను తీసుకున్నాం. పాఠ్యపుస్తకాల్లో నేర్చుకున్న అంశాలు ఎంతవరకు అవగాహన అయ్యాయో తెలుసుకోవడానికి బాగా ఉపయోగపడతాయి.

డాక్టర్ నల్ల తిరుపతినాయుడు,
డైట్ కళాశాల గణిత విభాగాధిపతి